నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ బుధవారం 31 జూలై 2024 | ADILABAD NIRMAL




సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

# రైతులకు ప్రయోజనం

నిర్మల్ చైన్‌గేట్, జూలై 30 : రుణమాఫీతో రైతులకు ప్రయోజనం చేకూరనుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శాసనసభ ప్రాంగణం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండో విడత రైతు రుణమాఫీలో భాగంగా రుణమాఫీ చెక్కులను ఆమె రైతులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడుత రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా రూ.1.50 లక్షల వరకు రుణాలు పొందిన రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయడం జరిగిందన్నారు. నిర్మల్ జిల్లాలో రెండో విడత రుణమాఫీకి సంబంధించి 19,058 మంది రైతులకు రూ.200.17 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే మొదటి విడుతలో భాగంగా 30,105 మంది రైతులకు రుణమాఫీ రూ.171.6 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. రెండో విడుతల్లో కలిపి 49,163 మంది రైతులు, రూ.371.93 కోట్లు జమ చేశామన్నారు. ఆధార్ కార్డుల పొరపాట్ల కారణంగా, రైతు రుణమాఫీలో పేరు రాని, ఖాతాలో జమకాని రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. రుణమాఫీ విషయంలో బ్యాంకర్లు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్ పాల్గొన్నారు.



● రేవంత్‌రెడ్డి వీసీ వెలవెల

కుభీర్‌లోని రైతువేదికలో సీఎం ప్రసంగానికి అరకొరగా హాజరైన రైతులు

## సీఎం ప్రసంగాన్ని వినేందుకు ఆసక్తి చూపని రైతులు

కుభీర్, జూలై 30 : కుభీర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రూ.1.50 లక్షల వరకు రుణమాఫీపై వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ప్రత్యక్షంగా వీక్షించేందుకు 15 మంది రైతులు మాత్రమే హాజరయ్యారు. ఇదీ కూడా పక్కన తహసీల్ ఆఫీసుకు పనుల నిమిత్తం వచ్చిన వారే ఉండడం గమనార్హం.

# రుణమాఫీ అయ్యేనా?

## మొదటి విడుతలోనే పరిష్కారం కాని సమస్యలు

● చాలా మంది రైతులకు అందని ప్రభుత్వ సాయం ● రెండో విడుతలోనూ అదే సమస్యల పరంపర ● అందుతుందో లేదోనని అనుమానం వ్యక్తం చేస్తున్న రైతులు

● నిబంధనల పేరిట కోత విధించకుండా అర్హులకు అందించాలి : రైతులు

ఆదిలాబాద్, జూలై 30(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ పథకం అమలుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 18న మొదటి విడుత రూ.ఒక లక్ష లోపు బ్యాంకుల్లో అప్పు ఉన్న రైతులకు రుణమాఫీ చేసింది. రెండో విడుతలో భాగంగా మంగళవారం రూ.1.50 లక్షల బ్యాంకు రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కలెక్టర్ కార్యాలయం, రైతు వేదికల్లో సమావేశాలను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా రెండో విడుతలో 17,647 మంది రైతులకు రూ.201.83 కోట్లను రుణమాఫీ జరిగినట్లు అధికారులు ప్రకటించారు. మొదటి విడుతలో రూ. ఒక లక్ష లోపు అప్పు ఉన్న 18,740 మంది రైతులకు రూ.120 కోట్లు మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో బ్యాంకు రుణం తీసుకున్న రైతుల సంఖ్య 1.19 లక్షలు ఉండగా.. రెండు విడుతల్లో 36,207 మందికి మాత్రమే రుణమాఫీ వర్తించింది. రూ.2 లక్షల రుణమాఫీలో భాగంగా చివరి విడుత మాత్రమే మిగిలి ఉండగా ఈ సంఖ్య 20 వేల లోపు ఉంటుందని రైతు సంఘాల నాయకులు అంటున్నారు. మూడు విడుతల రుణమాఫీ 50 వేల లోపు మంది రైతులకు మాత్రమే వర్తించనుండగా, అర్హులైన చాలా మందికి ప్రభుత్వ సాయం అందడం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### పరిష్కారం కానీ సమస్యలు


రూ.ఒక లక్ష లోపు రుణమాఫీ జరిగిన రైతులు 18,740 మంది ఉండగా.. నిబంధనల ఫలితంగా చాలా మందికి రుణమాఫీ వర్తించలేదు. రుణమాఫీకి అర్హులైనప్పటికీ బాకీ ఉన్న డబ్బుల కంటే తక్కువ, కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు అర్హులు ఉన్న ఒక్కరికి, బ్యాంకు సమస్యల కారణంగా చాలా మందికి రుణమాఫీ వర్తించలేదు. బ్యాంకు లోన్ మాఫీ కాని రైతులు అధికారులకు తమ సమస్యను తెలియజేశారు. పట్టా పాసుపుస్తకం కాకుండా రేషన్ కార్డును పరిగణలోకి తీసుకుని రుణమాఫీ వర్తింపచేయడం వల్ల చాలా మందికి జరగలేదని రైతులు సంఘాల నాయకులు అంటున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బ్యాంకుల్లో సాంకేతిక సమస్యల ఫలితంగా రుణమాఫీ జరగలేదని అధికారులు గుర్తించారు. మొదటి విడుత సమస్యలు పూర్తిగా పరిష్కారం కాకపోగా రెండో విడుతలో కూడా అర్హులుగా ఉన్న రైతులకు రుణమాఫీ జరగలేదని రైతులు పేర్కొంటున్నారు.

### నిబంధనల పేరిట కోతలు



*కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ పథకంలో నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయి. పట్టాపాసుపుస్తకం ఆధారంగా రుణమాఫీ జరుగుతుందని, కేవలం కుటుంబాలను గుర్తించడానికి రేషన్‌కార్డును పరిగణలోకి తీసుకుంటామని రాష్ట్ర మంత్రులు ప్రకటించారు. ఇందుకు విరుద్ధంగా రుణమాఫీ జరుగుతుంది. కుటుంబంలో ఎంతమంది రైతులు ఉన్న ఒక్కరికే మాత్రమే లోన్ మాఫీ చేస్తున్నారు. మొదటి విడత రుణమాఫీ చాలా మందికి రైతులకు అందలేదు. రెండో విడుతలో సమస్యలు ఉన్నట్లు మాకు సమాచారం ఉంది. ప్రభుత్వ నిబంధనల పేరిట కోతలు విధించకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలి.*

**- సంగెం బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక, జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్**



రైతులకు రుణమాఫీ చెక్కును అందజేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

# రెండో విడుతలో 17,647 మందికి..

● సమస్యల పరిష్కారానికి నోడల్ అధికారి నియామకం

● ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, జూలై 30(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండో విడుతలో 17,647 మంది రైతులకు రూ.201 కోట్ల రుణమాఫీ జరిగినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. రెండో విడుత రుణమాఫీ అమలులో భాగంగా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొదటి విడుత రుణమాఫీలో జిల్లా వ్యాప్తంగా 18,740 మంది రైతులకు ప్రయోజనం చేకూరిందన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరేలా బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు కృషి చేయాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి నోడల్ అధికారిగా రమేశ్‌ను నియమించామని, 72888 94003 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

### రూ.52 వేలే జమయ్యాయి..



*తలమడుగు, జూలై 30 : నా పేరు మంతె సత్యపాల్. వ్యవసాయం చేసేందుకు రూ.85 వేలు బ్యాంకులో రుణం తీసుకున్నా. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన రైతు రుణమాఫీ మొదటి విడుతలో రూ.లక్ష లోపు ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. కానీ.. నా ఖాతాలో మాత్రం రూ.52 వేలు మాత్రమే జమయ్యాయి. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో గందరగోళానికి గురవుతున్నారు. ప్రస్తుతం రెండో విడత జరుగుతున్నది. కానీ.. మొదటి విడుతలో రైతులందరికీ రుణమాఫీ డబ్బులు జమ కాలేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.*

# బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలి..

## అసెంబ్లీలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్



అసెంబ్లీలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్, జూలై 30(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం బోథ్ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని, బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ప్రజలకు ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వం 40 వేల దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు అందిస్తామని చెప్పి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మోసం చేసిందన్నారు. బోథ్ నియోజకవర్గంలోని కుప్టి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, బోథ్‌లో జనరల్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడంతోపాటు ఫైర్ స్టేషన్‌ను నిర్మించాలన్నారు. తలమడుగు మండలంలోని బరంపూర్ నుంచి మోర్కండి వరకు, సిరిచెల్మ నుంచి పెంబి వరకు రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వాలన్నారు. ఇచ్చోడ నుంచి సిరిచెల్మ, సిరికొండ వరకు డబుల్ రోడ్డును మంజూరు చేయాలని, ఇచ్చోడ మండలం కేంద్రాన్ని సబ్ డివిజన్‌గా మార్చడంతోపాటు బోథ్ నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రికి నిధులు కేటాయించినా.. ఈ సీజన్‌లో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన సిరికొండ, భీంపూర్, సొనాల మండలాలకు ప్రభుత్వ భవనాల్లో వసతి కల్పించాలని కోరారు. బజార్‌హత్నూర్ మండలంలోని దేగాం, భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని కోరారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్, జూలై 30 : భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వేర్వేరుగా మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు విలాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోని వస్తే వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు అందించి 200 రోజుల పని కల్పిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే భవన నిర్మాణ కార్మికులకు నూతన కార్డులను జారీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, వాటిని రెన్యూవల్ చేయడంలో తలెత్తుతున్న ఇబ్బందులను పరిష్కరించి అసంఘటిత కార్మికులకు పెన్షన్, ఇండ్ల స్థలాలను మంజూరు చేయాలన్నారు.



నిరసన తెలుపుతున్న భవన, వ్యవసాయ కార్మికులు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

# పరిశోధన స్థానం కార్మికులు..

ఎదులాపురం, జూలై 30 : వ్యవసాయ పరిశోధన స్థానంలో పని చేస్తున్న కార్మికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఆర్ఎస్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. 20 ఏండ్లకుపైగా ఏఆర్ఎస్‌లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలలో 26 పని దినాలు కల్పించాలని కోరారు. ఉన్న వారికి ఉపాధి చూపకుండా నూతన కార్మికులను తీసుకొచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, అదనంగా పని చేసిన వారికి అదనపు పారితోషకం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ఆర్టీసీ ఉత్తమ డ్రైవర్లకు సన్మానం

ఎదులాపురం, జూలై 30 : ప్రమాదాల నివారణకు తప్పనిసరిగా ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. మంగళవారం ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన ప్రమాద రహిత వారోత్సవ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తమ సర్వీసులో అత్యధిక కాలంపాటు ప్రమాదరహిత డ్రైవింగ్ చేసిన సీబీ రావు, మినాజొద్దీన్, అన్వర్‌ఖాన్ డ్రైవర్లను ఆర్టీసీ ఆర్‌ఎం సొలెమాన్‌తో కలిసి ఎస్పీ ఘనంగా సత్కరించారు.



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ గౌష్ ఆలం

# ఆశ కార్యకర్తల అరెస్టు

లక్ష్మణచాంద, జూలై 30 : ఆశ కార్యకర్తలను మంగళవారం ముందస్తుగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుమలత తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని హైదరాబాద్‌లో జరగబోయే ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయ ముట్టడికి బయలుదేరుతుంటే పోలీసులు అరెస్టు చేయడం సరియైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం ఎన్ని అరెస్టులు చేసినా డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో ఆశ కార్యకర్తలు

# ఏజెన్సీలో వైద్య శిబిరాలు నిర్వహించాలి

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**



వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఎదులాపురం, జూలై 30: ఏజెన్సీ ప్రాంతాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్న సందర్భంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 75వ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, 44 లక్షల 6 వేల మొక్కలకు గాను ఇప్పటివరకు 19 లక్షల 11 వేల మొక్కలు నాటడం జరిగిందన్నారు. వర్షాలు కురుస్తున్నందున సమయం వృథా కాకుండా వెంటనే మిగతా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. అవెన్యూ, కమ్యూనిటీ, బ్లాక్ ప్లాంటేషన్, ప్రభుత్వ సంస్థల్లో మొక్కలు పెద్ద ఎత్తున నాటాలని, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కోసం ఉపయోగపడే విధంగా మునగ, చింతపండు, కరివేపాకు మొక్కలు నాటాలన్నారు. మొక్కల నాటిన తీరును మండలాలవారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖర్జూర, ఈత మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఆయా శాఖలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల వివరాలు తెలిపారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి, గ్రామాల్లో ఏజెన్సీ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, విష జ్వరాలు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రై డే డ్రై డే నిర్వహించాలన్నారు. సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, జడ్పీ సీఈవో రత్నమాల, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

పరిసరాల పరిశ్రభంగా ఉంచడంతోపాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అదిలాబాద్ పట్టణంలోని కొలాం ఆశ్రమ పాఠశాల బాలురను మంగళవారం కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, సిక్ రూమ్, వంటగది, విద్యార్థుల గదులను పరిశీలించారు. విద్యార్థుల గదులు, సిక్ రూమ్ శుభ్రంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల అవరణలో చెత్త చెదరం పేరుకుపోయి ఉండడంతో వెంటనే మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. వంట గదిని పరిశీలిస్తూ సరుకులు, వండే విధానాన్ని గమనించారు. ఏమైన సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడుగగా ఫ్యాన్‌లు లేవని తెలుపగా ఆ ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరావు ఉన్నారు.

# వరకట్న వేధింపులకు వివాహిత బలి



సుజాత(ఫైల్)

బజార్‌హత్నూర్, జూలై 30 : గిర్నూర్ గ్రామానికి చెందిన గొర్ల సుజాత(30) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం బజార్‌హత్నూర్ మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గిర్నూర్ గ్రామానికి చెందిన మేకల పోసని, పెద్ద భూమన్న కూతురు సుజాతను అదే గ్రామానికి చెందిన గొర్ల అనిల్‌కు 2020 సంవత్సరంలో రూ.7 లక్షల కట్నం ఇచ్చి వివాహం చేశారు. కొన్ని రోజులుగా మారో రూ.3 లక్షల అదనపు కట్నం తీసుకురావాలని మేలో ఇంట్లో నుంచి పంపిం చేశారు. అదనపు కట్నం వేధింపులతో గత నెలలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. చుట్టు పక్కల వారు గమనించి వెంటనే 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్ తరలించారు. రిమ్స్‌కు వెళ్లే సరికి మృతి చెందిందని కుటుంబీకులు తెలిపారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.